

వేంకటేశ్వరాచారికి 'భూతపురి' స్మారక పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ప్రసిద్ధ కవి, విమర్శకులు, పరిశోధకులు, పరిష్కర్త, వ్యాఖ్యాత వైద్యం వేంకటేశ్వరాచార్యులు డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ 22వ స్మారక సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారని డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్ర శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25న ఉదయం 10 గంటలకు కడపలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించే భూతపురి 87వ జయంతి మహోత్సవంలో ఈ పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు. సాహిత్య, జ్యోతిష రంగాలలో విశిష్టసేవలందించిన వ్యక్తులకు 2003 నుంచి ఈ పురస్కారం అందజేస్తున్నట్లు, ఆ క్రమంలో వైద్యం వేంకటేశ్వరాచార్యులును రూ.10,000, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సత్కరిస్తామని పేర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగం మన బాధ్యత

యువ ఓటర్లకు కలెక్టర్ వి.విజయ్ రామరాజు సందేశం

ప్రజాశక్తి - కడప

ప్రజాస్వామ్య దేశంలో విలువైన ఓటుహక్కును వినియోగించుకోవడం పౌరులుగా మన బాధ్యత అని అర్హులయిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగించుకోవాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు యువ ఓటర్లకు సందేశం ఇచ్చారు. గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ సభాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తోపాటు జెసి గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, కడప ఆర్‌డిఒ మధుసూదన్, గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1950 సంవత్సరం భారత ఎన్నికల సంఘం (సిఇసి) ఏర్పడిన నాటి నుంచి ప్రతి ఏడాది జనవరి 25న వ్యవస్థాపక దినోత్సవాన్ని, అనంతరం 2011 నుంచి భారత ప్రభుత్వం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సంఘం ఏర్పాటును యావత్ భారతావనికి స్ఫురణకు తెచ్చేలా, ఓటు హక్కు విలువను చాటి చెప్పేలా ఈ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కొత్త ఓటర్లను ప్రోత్సహించడం, వోటింగ్ నమోదు సులభతరం చేయడమే ఈ జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రధాన ఉద్దేశం అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటు హక్కును పొంది, బాధ్యతగా ఓటుహక్కుని వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో పటిష్టమైన నాయకులను ఎన్నుకోవాలని యువ ఓటర్లకు ఆయన సందేశం ఇచ్చారు. జిల్లాలో ప్రస్తుతం 16.16 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారని, వీరంతా ఓటును తమ హక్కుగా గుర్తించడంతో పాటు తమ బాధ్యతగా భవించాలన్నారు. గత శాసన సభా ఎన్నికలకు జిల్లాలో 70 శాతం పైగా వోటింగ్ శాతం నమోదు కావడం శుభపరిణామం అన్నారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలో 100 శాతం ఓటింగ్ నమోదయ్యేలా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ఓటర్లను కోరారు. అనంతరం విద్యార్థులతో కడప ఆర్డీవో మధుసూదన్ ప్రతిజ్ఞ చేయించారు. ముద్ర డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులు, చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తహశీల్దార్ శివరామి రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ చంద్రమౌళి, సూపరిడెంట్ శివారెడ్డి, జిల్లా అధికారులు, జిల్లా ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థులు సీనియర్ ఓటర్లు పాల్గొన్నారు. అంతకుముందు నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ లో ర్యాలీని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా 100 మీటర్ల పొడవైన జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ, ఓటర్లలో అవగాహనను పెంచే నినాదాలు చేశారు. కార్యక్రమంలో జెసి గణేష్ కుమార్, కమిషనర్ ప్రవీణ్ చంద్, ఆర్‌డిఒ మధుసూదన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువ ఓటర్లయిన కళాశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. **విద్యుత్ భవన్‌లో..** ఓటు హక్కును విద్యుత్ ఉద్యోగులందరూ వినియోగించుకోవాలని గురువారం విద్యుత్ భవన్‌లో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ యస్. రమణ ప్రతిజ్ఞ చేయించారు. **బద్వేలు :** పట్టణంలోని రాచపూడి నాగభూషణం డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్‌సిసి, నేవీ, ఆర్మీ వారి ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు రాచపూడి నాగభూషణం డిగ్రీ అండ్ పిజీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది కళాశాల నుంచి నాలుగు రోడ్ల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బద్వేల్ ఆర్డీవో ఆకుల వెంకట రమణ ముఖ్యఅతిథిగా పాల్గొని ఓటు విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

పరిహాసమే!

- 999 పిడిఎఫ్‌లకు అందని పరిహారం
- రూ.454 కోట్ల చెల్లింపులకు నిరీక్షణ
- ఆందోళనలో గండికోట నిర్వాసితులు

ప్రజాశక్తి- కడపప్రతినిధి

గండికోట రిజర్వాయర్ ముంపు పరిధిలోనికి జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం, ముద్దనూరు మండలాల పరిధిలోని 22 గ్రామాలు ముంపు పరిధిలోనికి వచ్చిన సంగతి తెలిసిందే. వీటి పరిధిలో 17,809 నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున రూ.1800 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంది. 16,800 పిడిఎఫ్‌లకు రూ.10 లక్షల చొప్పున రూ.1346 కోట్లు పరిహారం చెల్లించినట్లు సమాచారం. మిగిలిన 999 పిడిఎఫ్‌లకు రూ.454 కోట్ల చెల్లింపులకు దశాబ్దాల తరబడి నిర్వాసితులు ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించింది. ఇందులో ఫేజ్-1 కింద సిఎం హామీ కింద రూ.295 కోట్లు, మిస్సింగ్ పిడిఎఫ్‌లకు రూ.46 కోట్లు, ఫేజ్-2 కింద కొండాపురం గ్రామానికి రూ.53 కోట్లు, ఫేజ్-3 కింద రూ.999 పిడిఎఫ్‌లకు రూ.56 కోట్లు చొప్పున రూ.454 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వైఎస్ జగన్ గండికోట నిర్వాసితులకు రూ. 6.75 లక్షలకు అదనంగా 3.25 లక్షల చెల్లిస్తామని హామీ నిచ్చారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఇచ్చిన హామీని అరకొర చెల్లింపులు చేసి మిగిలిన నిర్వాసి తులను విస్మరించడం ఆందోళన కలిగిస్తోంది. గండికోట నిర్వాసితులకు రూ.110 కోట్లతో 18 కాలనీలకు రూప కల్పన చేశారు. రూ.100 కోట్లతో 11 నిర్వాసిత కాలనీలను పూర్తి చేశారు. రూ.35 కోట్లు బిల్లుల్ని అప్‌లోడ్ చేశారు. మరో రూ.25 కోట్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది. మొత్తం 18 నిర్వాసిత కాలనీల్లో ఎనిమిది కాలనీలు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయి. ఇదేతరహాలో ఉమ్మడి కడప జిల్లాలోని సోమశిల, బ్రహ్మసాగర్, పైడిపాలెం, అన్నమయ్య, సర్వరాయ సాగర్, చిత్రావతి, శ్రీనివాసపురం రిజర్వాయర్ల పరిధిలోని నిర్వాసితులకు కోట్లాది రూపాయల మేరకు చెల్లింపులు చేయాల్సి ఉంది. 2024 సార్వ త్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నిర్వాసితుల సమస్యలను పాల కులు పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

'అందని ద్రాక్ష పుల్లన' సామెత చందంగా గండికోట నిర్వాసితుల పరిహారం పరిస్థితి తయారైంది. 2018 ఆగస్టులో టిడిపి సర్కారు గండికోట నిర్వాసితులకు రూ.6.75 లక్షల చొప్పన పరిహారం చెల్లింపులు చేసింది. ప్రాజెక్టుల కోసం త్యాగం చేసిన నేపథ్యంలో 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో వైఎస్ జగన్ తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే గండికోట నిర్వాసితులకు అదనంగా రూ.3.25 లక్షలను కలిపి రూ.10 లక్షల వరకు చెల్లింపులు చేస్తామని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆయన ఇచ్చిన హామీ మేరకు 999 పిడిఎఫ్‌లకు రూ.454 కోట్లు చెల్లింపులు ఆచరణ దిశగా అడుగులు పడకపోవడం ఆందోళన కలిగిస్తోంది.



ఆందోళన చేస్తున్న ముంపు గ్రామస్తులు (ఫైల్ ఫోటో)

కార్పొరేటర్లంటే చిన్న చూపా?

- సచివాలయ సిబ్బంది లెక్కజేయడం లేదు
- తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలి
- నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశంలో పలువురు కార్పొరేటర్ల ఆవేదన
- రూ.575 కోట్లతో నగర పాలకసంస్థ బడ్జెట్
- నగరంలో రూ.2,597 కోట్లతో అభివృద్ధి పనులు : మేయర్ సురేష్‌బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

తామంటే అధికారులకు చిన్న చూపు ఉందని, సచివాలయ సిబ్బం దికి కూడా లెక్క జేయడం లేదని కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గురు వారం మేయర్ కె. సురేష్‌బాబు అధ్యక్షతన 2024-25 ఆర్థిక సంవత్సరానికి నగర పాలక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా కార్పొరేటర్లు తమ డివిజన్లలోని సమస్యలపై సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. సమావేశానికి ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, నగర పాలక సంస్థ అధికారులు, కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 575.93 కోట్లు రాడికిగానూ, రూ. 5002.76 లక్షలు ఖర్చుగా నిర్ణయించారు. రూ. 73. 17 కోట్లు మిగులు నిల్వగా అంచనా వేశారు. ఇందులో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎస్సీ, ఎస్టీలు, వికలాంగులకు, స్త్రీ శిశు సంక్షేమం కోసం నిధులను కేటాయించారు. నికర నిధులో 40శాతం నిధులను మురికివాడలలో అభివృద్ధి పనులకు ఖర్చు చేయనున్నారు. ఎస్సీలకు రూ.4.26 కోట్లు, ఎస్టీలకు రూ.1.88 కోట్లు, స్త్రీ, శిశుసంక్షేమం కోసం రూ.1.42 కోట్లు, వికలాంగుల సంక్షేమం కోసం రూ.84 లక్షలు ఖర్చు చేయనున్నారు. రెవెన్యూ డివిజన్ల ద్వారా ఆస్తి పన్ను, గ్రంథాలయ పన్ను, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ఆస్తిపన్ను ద్వారారూ.47.15కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. నీటి పన్ను ద్వారా రూ.11.13 కోట్లు, ప్రభుత్వ బదిలీ, పరివాహక పన్నుల ద్వారా రూ.25 కోట్లు, యూజర్ ఛార్జీల ద్వారా రూ.14.13 కోట్లు, బిల్డింగ్ సెన్స్ ఫీజులు ప్రయివేట్ ఖాళీ స్థలాల పై పన్ను, ప్రకటనల పన్ను, కొత్త లేఅవుట్లు, ఫ్లాట్ల సబ్ డివిజన్ ద్వారా రూ.34.16 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ముందుగా నగర మేయర్ కెసురేష్ బాబు మాట్లాడుతూ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నాలుగున్నర సంవత్సర కాలంలో రూ.2,597 కోట్ల నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అధికారులు, కార్పొరేటర్లు సహకారంతో నగర పాలకసంస్థను అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని తెలిపారు. కార్పొరేటర్ షఫీ మంచినీటికి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. ఒకటో డివిజన్ కార్పొరేటర్ మాట్లాడుతూ అమృత్ పథకం కింద కులాయి కనెక్షన్లు ఇవ్వాలని, అంతకంటే ముందు పైప్ లైన్లు వేయాలని కోరారు. రెండవ డివిజన్ కార్పొరేటర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉక్కాయ పల్లెలో మంచినీరు అందడం లేదని బోర్ల ద్వారా నీళ్లు ఇచ్చే పరిస్థితి నుంచి గట్టెక్కించాలని కోరారు. కార్పొరేటర్ బాలస్వామి రెడ్డి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా గడపగడపకు తిరుగుతూ ఉంటే కార్పొరేషన్ అధికారులు ఒక్కరూ ఉండడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అధికారుల దృష్టిలో కార్పొరేటర్లకు విలువ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికుల సంఖ్య కార్పొరేటర్‌కు తెలియకుండా తగ్గించడం ఎంతవరకు సమంజసం ఉన్నారు. ఐదు నెలలు పనిచేసిన పారిశుధ్య కార్మికుల వేతనాలు ఇవ్వలేని దుస్థితిలో కార్పొరేషన్ ఉందా అని ప్రశ్నించారు. స్థానిక సమస్యలను వాలంటీర్లు కార్పొరేటర్ల దృష్టికి తీసుకువస్తే సచివాలయ సిబ్బంది వారిని బెదిరిస్తూ ఉన్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై స్పందించిన కమిషనర్ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ముంతాబేగం, బండి నిత్యానందరెడ్డి, అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి, షఫీ, గంగాదేవి, బాలస్వామిరెడ్డి, మల్లికార్జున, సూర్యనారాయణ, మోతుకూరి సుజాత, వెలిగండ్ల శిరీష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు



హాజరైన కార్పొరేటర్లు

ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలి


ప్రజాశక్తి - కడప

పెండింగ్‌లో ఉన్న రూ. 1200 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను వెంటనే విడుదల చేసి, సేవలను వెంటనే పునరుద్ధరించాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ నిర్వీర్యమైందని అన్నారు. నాలుగు సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వం ఏనాడు ఆరోగ్యశ్రీ నిధులను సకాలంలో విడుదల చేయలేదని చెప్పారు. కేవలం ప్రచారానికి మాత్రమే ఆరోగ్యశ్రీని వాడుకుంటూ గొప్పలు చెప్పుకుంటూ ఉన్నారే కానీ సామాన్య ప్రజలకు ఒరిగిందంటూ ఏమీ లేదని వాపోయారు. ఆరోగ్యశ్రీ ఆరోగ్యశ్రీ సేవలు అందించడానికి ప్రయివేట్ ఆస్పత్రులు ముందుకు రావడంలేదని, దీనికి కారణం వైసిపి ప్రభుత్వమేనని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఆరోగ్యశ్రీ నిధులను వెంటనే విడుదల చేసి ప్రయివేట్ హాస్పిటల్స్ ప్రజలకు ఆరోగ్య సేవలు పునరుద్ధరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో 22 డివిజన్ ఇన్‌ఛార్జిపుట్టబోయిన శ్రీనివాసులు, విశ్వనాథ్, అనిల్ పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పరిపాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నూరు

వైసిపి ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన సాగుతోందని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొ న్నారు. స్థానిక పంచాయతీ ఆవరణలో గురువారం డ్వాక్రా మహిళా ఆసరా కార్యక్రమంలో భాగంగా నాలుగో విడత నిధులను రూ 4 .10 కోట్లను మహిలలకు మెగా చెక్ రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు చేస్తున్నారని చెప్పారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో మోహన్ రెడ్డిని, తనను గెలిపించాలని కోరారు కోరారు. అనంతరం కొండపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, పాల కేంద్ర భవనాన్ని ప్రారరంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్ రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షులు చీర్ల సురేష్ యాదవ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా అధికార ప్రతినిధి గుమ్మ రాజేంద్రప్రసాద్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఆర్ వెంకట సుబ్బారెడ్డి (ఆర్‌విఎస్‌ఆర్) మండల ఉపాధ్యక్షులు ఆర్ఎస్ ఆర్(చిన్ను), సొసైటీ అధ్యక్షులు రామ్మూర్తి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు ఎస్.వి. నారాయణరెడ్డి, పార్టీ నాయకులు ముదిరెడ్డి సుబ్బారెడ్డి , శివాలపల్లె సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, కొండపేట సర్పంచ్ తుంగ చంద్ర యాదవ్, ఎంపిటిసి నాగిరెడ్డి, మాజీ ఎంపిటిసి భాస్కర్ రెడ్డి, చెన్నూర్ సర్పంచ్ వెంకటసుబ్బయ్య, డ్వాక్రా అధికారులు మహిళలు, పాల్గొన్నారు



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

వివాహ వేడుకల్లో కమలమ్మ

కలసపాడు : జాతీయ ఎస్సి కమిషన్ మాజీ సభ్యులు పి.ఎం.కమలమ్మ మండలంలోని బాలయ్యపల్లెలో ఎంబడి జోసెఫ్ కుమారిడి వివాహానికి హాజరయ్యారు. వధువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెతోపాటు పిసిసి సభ్యులు జె.ప్రభాకర్, మాదిగ ఉద్యోగుల సమైక్య జిల్లా అధ్యక్షులు పిచికే బాబు, ఉపాధ్యక్షులు కమలాపురం ప్రసాద్, నియోజకవర్గం ఎంఇఎఫ్ అధ్యక్షులు సగిలి ప్రసాద్‌రావు, విశ్రాంత ఉపాధ్యాయులు సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

వైసిపికి బిసిలు బుద్ధి చెప్పాలి

కడప అర్బన్ : బిసిల ఓట్లతో గద్దెనెక్కి, బీసిలను అణగదొక్కిన వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాధవి పేర్కొన్నారు. నగరంలోని ఎనిమిదవ డివిజన్ స్కౌట్ హాల్ వద్ద గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని, సూపర్ సిక్స్ పథకాలు అమలవుతాయని తెలిపారు కార్యక్రమంలో జనసేన జిల్లా, నగర అధ్యక్షులు సుంకర శ్రీనివాస్, శివకొండ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రచారం ఒట్టి బూటకం : యుటిఎఫ్

కడప అర్బన్ : సిపిఎస్ విధానంలో పాత పెన్షన్ విధానంకంటే ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయని చేసిన ప్రచారం ఒట్టి బూటకమని తేలిపోయిందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. గురువారం యుటిఎఫ్ భవన్‌లో చలో రాజమండ్రి కరపత్రాలు ఆవిష్కరణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ రద్దుకు సంబంధించి ఎన్నో ప్రాతినిధ్యాలు, పోరాటాల తర్వాత గత ప్రభుత్వం టక్కర్ కమిషనర్ నియమించిందని పేర్కొన్నారు. జిపిఎస్ విధానానికి గ్యారంటీ లేదన్నారు. కార్యక్రమంలో నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు పోతురాజు చంద్రశేఖర్, జి.వెంకటసుబ్బయ్య, గోపీనాథ్, అబ్దుల్ గనీ, సలీం బేగ్, సమీర్ బాష, వీరనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలి : కలెక్టర్

కడప : జిల్లాలో అన్నిరకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టం లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు, జెసి గణేష్ కుమార్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. సిఎస్ వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను శాఖల వారీగా అన్ని అంశాలలో ముందంజలో నిలిపేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే క్షేత్రస్థాయిలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

రోడ్డు భద్రతపై నగరంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - కడప

35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా గురువారం సాయంత్రం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో కడప నగరంలోని ఆయా విద్యాసంస్థల విద్యార్థిని విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా ఫైర్ ఆఫీసర్ ధర్మారావు, ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి బయలుదేరి ఎస్‌పి బంగ్లా , జిల్లా కోర్టు మీదుగా బస్టాండ్ వద్ద అంబేద్కర్ కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ మాట్లాడుతూ మన జిల్లాలో ఇప్పటికీ ప్రతిరోజు రహదారి ప్రమాదాలు ద్వారా రెండు మరణాలు సంభవిస్తున్నాయని, ప్రజలంతా రహదారి భద్రత నియమాలు పాటించినట్లయితే ఈ ప్రమాదాలను, మరణాలను అరికట్టగలమని తెలిపారు. అంబేద్కర్ కూడలి వద్ద విద్యార్థిని విద్యార్థులతో మానవహారంతో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ శ్రీ సీతారామ రెడ్డి, వారి సిబ్బంది మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ విజయభాస్కర్ , ప్రసాద్ , లక్ష్మీ ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు. **చెన్నూరు :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఆర్ఇపిఎల్ ప్రాజెక్టు హెడ్ మదన్మోహన్ పేర్కొన్నారు. గురువారం జాతీయ 35వ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా స్థానిక శ్రీ రాజరాజేశ్వరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ సహకారంతో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆపరేషన్ హెడ్ అరుణ్‌రాజ్, రూట్ మేనేజర్ కొండలరావు, రూట్ ఆఫీసర్ కుదుపుద్దీన్‌బాషా, కరస్పాండెంట్ డాక్టర్ రామసుబ్బమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కెఎల్ఎం కళాశాలలో మాక్ పోలింగ్

ప్రజాశక్తి - కడప అర్బన్

14వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సంవత్సరం జరగనున్న ఎన్నికల్లో ఎలా పాల్గొనాలి అని అవగాహన కల్పించారు. బ్యాలెట్ పేపర్ ముద్రించి, చేతికి సిరా గుర్తు వేసి మరి నిర్వహించారు. బ్యాలెట్ బాక్స్ ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు ఓటర్ స్లిప్పులు పంచారు. క్యూ లైన్లో నిలుచుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో విద్యార్థినులు క్లాస్ రెప్రజెంటేటివ్ పదవికి పోటీ చేశారు. విద్యార్థినులు మాక్ పోలింగ్లో పాల్గొని వారిని ఓటు ద్వారా ఎన్నుకున్నారు. ఫ్యాకల్టీలు పోలింగ్ ఆఫీసర్ల పాత్రను పోషించారు. పోలింగ్ అయిన తర్వాత మధ్యాహ్నం ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటించారు. మాక్ పోలింగ్ ద్వారా విద్యార్థినులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. వి. రత్నమ్మ, హెచ్ఒడిలు పాల్గొని ప్రసంగిస్తూ ఇలాంటి కార్యక్రమంలో ద్వారా విద్యార్థినులు ఎంతో ఉపయోగమని తెలిపారు. సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

దూదేకులకు రాజకీయ అవకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి-కడప సిటీ

దూదేకులకు రాజకీయ అవకాశాలు కల్పించాలని ఎంబిసి రాష్ట్ర ఆధ్యక్షులు సుంకేసుల బాదుల్లా డిమాండ్ చేశారు గురువారం స్థానిక ఎంబిసి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 24 లక్షలు మంది దూదేకుల ముస్లిములున్నారని చెప్పారు. ఇప్పటి వరకు ఒక్క ఎమ్మెల్యే, ఒక ఎమ్మెల్సీ, ఒక్క ఎంపీ సీట్లలో అవకాశం కల్పించలేదని వాపోయారు. దూదేకులను ఓటు బ్యాంకుగానే రాజకీయాపార్టీలు చూస్తున్నాయని విమర్శించారు ప్రతి నియోజకవర్గంలో 10వేలు నుండి 30 వేలు ఓటర్లు ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో ఏపార్టీ నైనా ఓడించే స్థాయిలో దూదేకులు ఉన్నారన్నారు 2024 ఎన్నికల్లో రెండు ఎమ్మెల్యే ఒక ఎంపీ సీటును తమకు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేస్తున్నామని తెలిపారు



మాట్లాడుతున్న సుంకేసుల బాదుల్లా

36 గంటల దీక్షను జయప్రదం చేయండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి విడుదలలో తీవ్ర జాప్యం చేస్తోందని, ఇందుకు నిరసనగా డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో ఈనెల 27,28 న రెండు రోజులు 36 గంటల నిరహార దీక్షలు నిర్వహించనున్నామని రాష్ట్రంలోని డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం.చిన్ని, వీరనాల.శివకుమార్ తెలిపారు. గురువారం 36 గంటల దీక్ష పోస్టర్‌ను జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడి కి నిరుద్యోగుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా గడిచిన నాలుగు సంవత్సరాలలో ఒక్క నోటిఫికేషన్ అయిన వదిలేవారని అన్నారు. ఇచ్చిన మాట కూడా నిలబెట్టుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా డిఎస్‌సి నిర్వహిస్తామని పాదయాత్ర సమయంలో వై.ఎస్. జగన్ హామీ ఇచ్చారని, ఇప్పటి వరకూ ఒక్క డిఎస్‌సి కూడా వదలలేదని వాపోయారు. బొత్స సత్య నారాయణ సంక్రాంతి తర్వాత డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారని, ఇప్పటికీ విడుదల చేయలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వాలని, లేకుంటే రాబోవు రోజులలో ప్రభుత్వానికి శంకరగిరి మాన్యాలు తప్పవన్నారు. నిరుద్యోగ డిఎస్‌సి అభ్యర్థులు 36 గంటల దీక్షలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు షేక్. షాకీర్, నగర నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

యుఇసిడబ్ల్యూయు రాష్ట్ర మహాసభకు తరలిరండి

పోరుమామిళ్ల : నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (యుఇసిడబ్ల్యూయు) రాష్ట్ర రెండవ మహాసభ నిర్వహిస్తున్నట్లు మండల సంఘం అధ్యక్షులు వీరయ్య, సహాయ కార్యదర్శి రమణారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎడిఇ కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభకు జాతీయ నాయకులు ఎస్.రాజేంద్రన్, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎవి. నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు, రాష్ట్ర జెఎసి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు మాట్లాడుతూ గడిచిన 20 ఏళ్లుగా సంస్థలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలన్న ప్రధాన డిమాండ్‌పై మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిస్కౌంట్ జిల్లా అధ్యక్షులు శివశంకర్ మాట్లాడుతూ సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే విధమైన ప్రణాళిక రచన, ఉద్యమ రూపకల్పన మహాసభలో చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇసిడబ్ల్యూ నాయకులు రంగస్వామి, రమేష్, ఎస్‌పి ఎం.చిన్న కృష్ణ, వెంకటేష్, పవన్ , కళ్యాణ్ వెంకట కళ్యాణ్, కాశి నారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

టిడిపి విజయం ఖాయం

కడప అర్బన్ : రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ చంద్రబాబు నాయుడుకు ఓటు వేసి గెలిపిస్తారాని టిడిపి సీనియర్ నేతలు కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వి. ఎస్.అమీర్ బాబు, అలాం ఖాన్‌పల్లి లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని రహమతియ ఫంక్షన్ హాల్లో కడప నియోజవర్గ క్లస్టర్లు, బూత్‌లెవల్ డివిజన్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఒక్క చంద్రబాబు నాయుడు తోనే సాధ్యం అన్నారు. అరచకమైన పరిపాలనను అంతం అందించాలంటే చంద్రబాబు నాయుడు సిఎం కావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కడప నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి బూత్ లెవల్‌లో ఇద్దరు మహిళలను నియమిస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, నగర ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, 12 వ డివిజన్ సీనియర్ నాయకులు మజ్జరి జయరాం, మాజీ కార్పొరేటర్ జాకీర్, టి ఎన్ టి యు సి రాష్ట్ర ఉపాధ్యక్షులు జింక శీను, పాలకొండ గుడి మాజీ చైర్మన్ ఓబుల్ రెడ్డి, కడప తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, పల్లె సుధాకర్ రెడ్డి, మహిళా నాయకురాలు 19 వ డివిజన్ ఇన్‌ఛార్జి రామలక్ష్మమ్మ, బీదోళ్ళ స్వర్ణలత, తాటగిరి నిర్మల, స్వర్ణలత పాల్గొన్నారు.

అధ్యాపకులకు శిక్షణ

ప్రజాశక్తి- కడప అర్బన్

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో నోడల్ రిసోర్స్ సెంటర్ (ఎన్ఆర్‌సి) ఆధ్వర్యంలో కమిషనర్ విద్య వారి ఆదేశాల మేరకు గురువారం జిల్లాలోని జిల్లాలోని వివిధ ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు భావోద్వేగ అభ్యాసన ప్రక్రియ, స్వీయ బోధనా పద్ధతులపై సర్టిఫికెట్ కోర్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే అధ్యాపకుల ప్రథమ కర్తవ్యమని చెప్పారు. శిక్షణ అనంతరం అధ్యాపకులు తమ బోధనలో నూతన పద్ధతులను ఉపయోగించి వినూత్న రీతిలో సృజనాత్మకంగా విద్యార్థులకు బోధించడానికి కావాల్సిన మెలకువలను నేర్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి అధ్యాపకులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగపరచుకుని విద్యార్థుల భవిష్యత్తు కోసం పాటుపడాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఆర్‌సి కో-ఆర్డినేటర్ ఎం.వి. రమణయ్య, మాస్టర్ ట్రైనర్స్‌గా బోటనీ అధ్యాపకులు యుగవాణి, కెమిస్ట్రీ అధ్యాపకులు నాగేంద్ర, పొలిటికల్ సైన్స్, వివిధ సబ్జెక్టుల అధ్యాపకులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జన్మభూమి కమిటీలతో దోపిడీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

టిడిపి పాలనలో జన్మభూమి కమిటీలతో ప్రజల్ని దోచుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని 3వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం జన్మభూమి కమిటీలను పెట్టి అభాసుపాలైందన్నారు. డబ్బులు తీసుకుని ప్రభుత్వ పథకాలను అర్హులుగా ఎంపిక చేసే వారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లా జానీ, కొండారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని కానగూడూరు గ్రామానికి చెందిన రైతు తోట సుధాకర్ పంటలు సరిగా పండక, గిట్టుబాటు ధరలు లేక అప్పులు ఎక్కువై ఈనెల 23న ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ. ప్రజాసంఘాల నాయకులు గంజికుంట నాగరాజు, వీరనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సుధాకర్ కుటుంబాన్ని గురువారం వారు పరామర్శించారు.

వైఎస్ జయమ్మకు నివాళులర్పించిన విజయమ్మ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తల్లి వైఎస్ జయమ్మకు వైయస్సార్ సతీమణి మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ గురువారం నివాళులర్పించారు. జయమ్మ 18వ వర్ధంతి సందర్భంగా ఆమె సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థ నలు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల సర్పంచ్‌గా ఉండి ప్రజలకు సేవలందించి, అవార్డు పొందారన్నారు. కార్యక్రమంలో చైర్మన్ వరప్రసాద్, సిఎంఒ జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లరు డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, వైఎస్ కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

ఫైనల్లో బాలికల జూనియర్ కళాశాల విజయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ఫైనల్లో ప్రథమ స్థానంలో నిలిచారని ఆ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతు రావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక కళాశాలలో మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు కబడ్డీ పోటీలలో ప్రథమ స్థానంలో ప్రతిభను కనపరిచినందుకు రూ.35 వేలు నగదును గెలుచున్నారన్నారు. వారికి, వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ క్రీడాకారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజాస్వామ్యంలో ఓటు విలువకు ఎంతో ప్రాధాన్యత ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ఓటర్ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ మదీనాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదుకు అర్హులని చెప్పారు. ఓటర్లను చైతన్య చేయడం ద్వారా ప్రజాస్వా మ్యాన్ని బలోపేతం అవుతుందన్నారు. దేశ సమగ్రత అభివృద్ధిలో జాతీయ సేవా సంస్థ పాత్ర కీలకమన్నారు. సేవా కార్యక్రమాల పట్ల నిరంతరం ఎన్ఎస్ఎస్ ముందుంటుందని ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలకొండ గంగాధర్, ఎంపిటిసి రహంతుల్లాఖాన్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కరీముల్లా, వాటంటీర్ గౌస్, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఆర్‌డిఒ వెంకటేశులు పేర్కొన్నారు. గురువారం విద్యాధరి పాఠశాల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఓటర్లు ఓటు వేసేందుకు అధిక సంఖ్యలో పాల్గొనాలని, యువత ఇంకా ఎవరైనా ఓటరుగా నమోదు కాకుంటే వారు వెంటనే నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ జగదీష్, కృష్ణమోహన్ స్వామి, కరస్పాండెంట్ భాను ప్రకాష్ పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ఏప్రిల్‌లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు అనే ఆయుధంతో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరి వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం అయిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంతర్జాతీయ ఓటర్ల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఓటు మన జన్మ హక్కు అని, ఓటు అనే ఆయుధంతో వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

మైదుకూరు తహశీల్దార్‌కు అవార్డు

ప్రజాశక్తి - చాపాడు

జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ఎన్నికల కార్యకలాపాలకు సంబంధించి ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు మైదుకూరు తహశీల్దార్ బి.అనురాధకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌చే అవార్డు అందజేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ప్రోత్సహిస్తూ అభినందించారు.

అవగాహన కార్యక్రమాలు... జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా మైదుకూరు, చాపాడు మండలాల్లో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మైదుకూరు నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, విఆర్ఒలు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

జగన్ ఓటమిని ఒప్పుకోవడం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన ఓటమిని ఒప్పుకోవడం హర్షణీయమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందే ఓటమి ఫోబియాతో జగన్ చేతులు పైకి ఎత్తారని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. వైఎస్ కుటుంబాన్ని కాంగ్రెస్ చీల్చిందని జగన్ ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు. వాస్తవంగా జగనే వైఎస్ కుటుంబాన్ని చీల్చారని పేర్కొన్నారు. జగన్ తండ్రి రాజశేఖర్‌రెడ్డి, చిన్నాన్న వివేకానందరెడ్డి కాంగ్రెస్ పార్టీ అన్నారు. చెల్లెలు షర్మిలమ్మ కాంగ్రెస్ పార్టీ అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని, ప్రత్యేకహోదాతోపాటు విభజన చట్టంలోని అన్ని అంశాలను అమలుచేస్తామన్నారు.

70 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - వల్లూరు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్న స్థావరాలపై మెరుపు దాడి చేసి 70 మద్యం బాటిళ్లను స్వాధీనం పరుచుకున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. గురువారం వల్లూరు, సీతాకాటపల్లె గ్రామంలో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమంగా గుట్కా, గంజాయి, మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేంపల్లె : అక్రమంగా తరలిస్తున్న 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ చాంద్‌బాషా తెలిపారు. గురువారం మండలంలోని వీరన్నగట్టుపల్లె గ్రామానికి చెందిన రాముడు అనే వ్యక్తి మద్యం బాటిళ్లను తీసుకు వెళుతుండగా పట్టుకున్నట్లు చెప్పారు. రాముడ్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

కడ్డీ మిరప సాగుతో రైతు కుదేలు

భారీగా పడిపోయిన ధరలు - రైతుల్లో దిగాలు



ఎండబెట్టిన మిరపకాయలు, పొలంలో మిరపకాయలను కోస్తున్న కూలీలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల వ్యాప్తంగా నూతనంగా సాగుచేసిన కడ్డీ మిరప సాగుతో రైతులు కుదేలవుతున్నారు. మండలంలోని గురిజాల, చవాటిపల్లె, వై.కొత్తపల్లె, చెర్లోపల్లె, లోమడ, సింహాద్రిపురం తదితర గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో కడ్డీ మిరప సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. గతంలో గుంటూరు జిల్లాలో విస్తారంగా సాగు చేసే ఈ రకం పులివెందుల ప్రాంతంలో గత ఏడాది నుంచి సాగుకు ఉపక్రమించారు. అయితే గత ఏడాది క్వింటాల్ మిరప రూ.28 వేల నుంచి రూ.35 వేల వరకు ధర పలికింది. గత ఏడాది పదుల సంఖ్యలో మాత్రమే రైతులు సాగు చేసి మంచి దిగుబడి రావడం తోపాటు ధర ఆశాజనకంగా ఉండడంతో ఆశించిన అంత స్థాయిలో గిట్టుబాటు అయింది. ఈ నేపథ్యంలో రైతులు అధిక సంఖ్యలో కడ్డీ మిరప సాగుకు శ్రీకారం చుట్టారు. గుంటూరు, ఆదోని ప్రాంతాల నుంచి రైతులు విత్తనాలు తెచ్చి స్థానిక నర్సరీలలో పెంచి, అనంతరం నాటారు.

తెగులును అధిగమించినా దక్కని ఫలితం

మిరప సాగులో వచ్చే తెగులును అధిగమించినప్పటికీ ధరలు అమాంతంగా తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఎండు మిరపకాయలు క్వింటా రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు మాత్రమే ధరలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో కర్ణాటక రాష్ట్రంలోని బ్యాడగి, గుంటూరు, ఆదోని మార్కెట్లో మంచి ధరలు ఉండేవి. అయితే ప్రస్తుతం మార్కెట్లో మిరపకాయలు ధరలు అమాంతంగా పడిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒక ఎకరం సాగుకు దాదాపు రూ.లక్ష నుంచి రూ.లక్ష యాభై వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు చెబుతున్నారు. ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే సమయంలో ధరలు భారీగా తగ్గిపోవడం ఏంటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం మిర్చి రైతులను ఆదుకోవాలి



మిర్చి సాగు చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. ఈ తరుణంలో ప్రభుత్వం ఆదుకోవాలి. పెట్టుబడులు అధికంగా పెట్టాం. పంట చేతికి వచ్చిన సమయంలో ధరలు బాగా తగ్గి పోయాయి. తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం పరిహారం అందించాలి.

- మోహన్ రెడ్డి, మిర్చి రైతు, గురజాల

ప్రజల పొత్తుతోనే ఎన్నికల బరిలోకి.. : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్రంలో మిగిలిన పార్టీలు పొత్తులు పెట్టుకుంటుంటే.. తాము మాత్రం ప్రజలతో మాత్రమే పొత్తు పెట్టుకుని ఎన్నికల బరిలోకి వెళుతున్నామని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఖాదర్‌పల్లె, చిన్నగురువలూరు, బద్రిపల్లె, సోమాపురం గ్రామాల్లో గురువారం నూతనంగా నిర్మించిన ఆర్‌బికె, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు, సీతారామపురంలో కల్వర్టు నిర్మాణానికి, ఖాదర్‌పల్లెలో దర్గా అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సోమాపురంలో ఆయన మాట్లాడుతూ టిడిపి రాష్ట్రంలోని అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకునేందుకు పావులు కదుపుతూ ఎన్నికల బరిలోకి వెళుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైసిపి ప్రభుత్వం నేరుగా ప్రజలతోనే పొత్తు పెట్టుకుని చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఓట్లు అడుగుతూ ముందుకు సాగుతున్నామన్నారు. టిడిపి నాయకులు వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదని మాట్లాడుతున్నారని తెలిపారు. 2014-19లో అభివృద్ధి చేసి ఉంటే అదే మ్యానిఫెస్టోతో ప్రజల్లోకి వెళ్లాలన్నారు. 2019-24లో చేసిన అభివృద్ధితో వైసిపి ప్రజల్లోకి వెళుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామన్నారు. చంద్రబాబు హయాంలో గాలికి వదిలేసిన రోడ్లను అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ పరిధిలోని రైతులకు రూ.100 కోట్లు ఇన్సూరెన్స్ రూపంలో మంజూరైందన్నారు. ప్రజల వద్దకే పాలన తెచ్చామన్నారు. నక్కలదిన్నె, చింతకుంట గ్రామాలకు నూతనంగా అదనపు పిహెచ్‌సిలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, ఎంపిపి టి.లక్ష్మమయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, పిఆర్ డిఇ మల్లేశ్వర్‌రెడ్డి, ఎఇ ఈశ్వరయ్య, ఎఒ మ్యాగీ, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ మల్లేష్, మండల వైద్యాధికారి రాజేష్ కుమార్, వైసిపి నాయకులు రామ్మోహన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జయరామిరెడ్డి, సివి సుబ్బారెడ్డి, సోమాపురం సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సోమాపురంలో ఆర్‌బికెను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

దువ్వూరు : మండల పరిధిలోని కానగూడూరు గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గురువాం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాల నిమిత్తం అందుబాటులో ఉండే అన్ని సదుపాయాలు ఆ గ్రామం పరిధిలో ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి, తహశీల్దార్ రామకుమారి, డాక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రూరల్ పరిధిలోని అమృత్‌నగర్ స్థలాల్లో కనీస వసతులు కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ 2008లో పేదలకు స్థలాలు ఇచ్చారు కానీ అక్కడ కనీస వసతులు కల్పించడంలో అధికారులు, ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు విఫలమైనారన్నారు. దాదాపుగా 2300 మందికి స్థలాలు ఇచ్చి కరెంటు, మంచినీళ్లు, రోడ్లు హౌసింగ్ లోన్లు ఇవ్వడంలో విఫలమయ్యారన్నారు. పేదవారికి మౌలిక వసతులు కల్పించకుండా చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి కనీస వసతులు కల్పించాలన్నారు. పేదలు వేసుకున్న బేస్ మట్టాల జోలికి వస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. శుక్రవారం నుంచి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్నామన్నారు. అప్పటికీ అధికారులు స్పందించకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శేఖర్, బాబు, చెన్నారెడ్డి, జిల్లా కార్యదర్శి ముంతాజ్, బాను, శివ, లత, పెద్ద ఎత్తున లబ్ధిదారులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, లబ్ధిదారులు

తాగునీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

తీవ్ర వర్షాభావ పరిస్థితులు రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో గురువారం ఎంపిపి టిలక్ష్మమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ నిధులను తాగునీటికి వినియోగించాలన్నారు. వ్యవసాయానికి నీటి కొరత రాకుండా కెసి కెనాల్‌కు సరఫరా చేయగలిగామన్నారు. ప్రస్తుతం వేసవిలో సాగుచేసిన వరి పంట ఎండిపోతున్నదని శాస్త్రవేత్తలను పిలిపించి, అందుకుగల కారణాలను గుర్తించాలన్నారు. ఈఏడాది రబీలో గతంలో కన్నా 6వేల ఎకరాలు సాగు పెరిగిందని వ్యవసాయ అధికారి మ్యాగీ ఎమ్మెల్యేకు తెలిపారు. జొన్న పంటను రైతులు నుంచి గిట్టుబాటు ధరకు సేకరించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ యామిని, ఉప ఎంపిపి శుభకరణమ్మ, సిడిపిఒ సావిత్రమ్మ, మండల అధికారులు రవిశంకర్, మహమ్మద్ గౌస్, విజయ్ కుమార్, ఈశ్వరయ్య, రాధాకృష్ణవేణి, దాదాబాషా, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా రోడ్ల విస్తరణ పనులు

వేంపల్లె : వేంపల్లెలో రోడ్ల విస్తరణ పనులు సక్రమమైన పద్ధతిలో జరగలేదని టిడిపి రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్ఎండి షబ్బీర్, జిల్లా రైతు అధ్యక్షుడు అన్నారెడ్డి బాలస్వామిరెడ్డి ఆరోపించారు. గురువారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి నాలుగు రోడ్ల సర్కిల్‌లో 90 అడుగులు, మిగతా రోడ్ల విస్తరణ పనులు 72 అడుగులుగా విభజించారని చెప్పారు. అయితే నాలుగు రోడ్ల సర్కిల్‌లో ప్రయివేటు వ్యక్తుల స్థలాలకు సంబంధించి 90 అడుగుల విస్తీర్ణంలో 45 అడుగులు తీసుకున్నారని తెలిపారు. జడ్‌పి గదుల వైపు వచ్చే సరికి అధికారులు కొలతలు తీసుకోకుండా సర్కిల్ ఏర్పాటు చేయడం సబబు కాదన్నారు. అధికార పార్టీ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ప్రయివేటు వ్యక్తులకు చెందిన స్థలాన్ని ఆక్రమించడం దుర్మార్గమన్నారు. నాలుగు రోడ్ల కూడలిలో ప్రభుత్వం స్థలం కాకుండా ప్రయివేటు వ్యక్తుల స్థలం ఎక్కువగా అధికారులు ఆక్రమించడం వల్ల 4 కుటుంబాలకు చెందిన మైనార్టీలు రోడ్డున పడ్డారని చెప్పారు. జిల్లా మైనార్టీ కార్యదర్శి పూల అల్లా బకష్, మోహన్‌రెడ్డి, పివి రమణ, మండల ప్రధాన కార్యదర్శి మహబూబ్ షరీఫ్, శివయ్య, అల్లాబకష్, అమానుల్లా, మాజీ ఎంపిటిసి సంటెన్న పాల్గొన్నారు.

ఆర్‌టిడి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక రూరల్ పరిధిలోని బొజ్జవారిపల్లెలో రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వైవియు ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ ఎస్.రమణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ సేవ చేయడం అలవ ర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఏడు రోజులుపాటు వివిధ కార్యక్రమాల్లో గ్రామాభివృద్ధికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవలందిస్తారని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రామాంజనేయమ్మ, ఉపాధ్యాయుడు భద్రయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌పై 'వరద' ఆగ్రహం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పేద ప్రజల భూములను ఇతరులకు ఆన్‌లైన్ చేస్తూ స్థానిక తహశీల్దార్ నజీర్ అహ్మద్ రూ.10 కోట్ల మేర అక్రమాస్తులు సంపాదించారని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని నంగునూరుపల్లె గ్రామానికి చెందిన బాబు అనే వ్యక్తి భూమిని నాగయ్య అనే వ్యక్తి పేరు మీద ఆన్‌లైన్ చేసి పాసుబుక్ కూడా మంజూరు చేశారని గురువారం రెవెన్యూ కార్యాలయం వెళ్లి తహశీల్దార్ నజీర్ అహ్మద్‌పై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డాడు. జాయింట్ కలెక్టర్ వద్ద అప్పీలులో ఉన్న భూమి సమస్యను పరిష్కరించకుండానే ఒక తహశీల్దార్ ఏ విధంగా పాస్ బుక్ మంజూరు చేస్తాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాళ్లమాపురం గ్రామ పంచాయతీలో 1985లో వేసిన 14 ఎకరాల వెంచర్‌ను ముగ్గురు వ్యక్తుల పేరున తహశీల్దార్ నజీర్ అహ్మద్ అనుభవం సర్టిఫికెట్ మంజూరు చేసి, ఆ స్థలాన్ని కల్వరి టెంపుల్ హైదరాబాద్ వారికి అమ్ముకునేలా సహకరిం చినందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఇంటికి పిలిచి కోటి రూపా యలు ఆయనకు ఇచ్చాడని వరద ఆరోపించారు. తహశీల్దార్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన పేర్కొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు సాయం

ఎర్రగుంట్ల : మండల వ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలకు వైయస్సార్ ఆసరా ద్వారా ప్రభుత్వం నాలుగో విడత సాయం అందించిందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. స్థానిక పట్టణ పరిధిలోని ఎస్వీ కళ్యాణమండపంలో గురువారం నిర్వహించిన వైయస్సార్ ఆసరా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళలకు వైసిపి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పిటిసి బాలయ్య, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, మెప్మా పీడీ సురేష్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు, మెప్మా సీవోలు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తాం

జమ్మలమడుగు : జమ్మలమడుగు మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని నగర పంచాయతీ చైర్పర్సన్ వేల్పుల శివమ్మ పేర్కొన్నారు. జమ్మలమడుగు నగర పంచాయతీలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మొదటగా సభ్యులు 2024-25 సంవత్సరపు బడ్జెట్ అంచనాలను ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ మాట్లాడుతూ సభ్యులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య మాట్లాడుతూ మున్సిపల్ సమావేశం మూడు నెలలకు ఒకసారి కాకుండా ప్రతినెల నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు ముల్లా జానీ, పోచిరెడ్డి శివరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు లక్ష్మయ్య, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



గండికోటలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

పర్యాటకులకు ఆనంద నిలయం గండికోట

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గండికోట పర్యాటకులకు ఆనంద నిలయమని జిల్లా పర్యాటక శాఖ అధికారి మల్లికార్జున అన్నారు. గురువారం జాతీయ పర్యాటక దినోత్సవ సందర్భంగా గండికోటలో స్వదేశ్ దర్శన్‌లో భాగంగా విద్యార్థులు స్వచ్ఛత డ్రైవ్, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ గండికోట జిల్లాలోనే కాకుండా ప్రపంచంలోనే పర్యాటకంగా ప్రసిద్ధి చెందిన ప్రాంతం అన్నారు. అనంతరం గండికోట సర్పంచ్ కే గురుఈశ్వర్ మాట్లాడుతూ గండికోటకు దేశంలో నలుమూలల నుంచి వస్తున్నారని, పర్యాటకులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అంతకుముందు వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రొద్దుటూరు, సాయి పరమేశ్వర డిగ్రీ కాలేజ్ జమ్మలమడుగు విద్యార్థులచే గండికోటలో నృత్య ప్రదర్శన చేయించారు. కోటలోని ప్రదేశాలలో చెత్త సేకరించే క్లీనింగ్ ప్రోగ్రాం చేపట్టారు. కార్యక్రమంలో కవిత టూరిజం హొటల్ మేనేజర్ మురళి రాయల్, ఎస్వీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వర్ రెడ్డి, డ్వాక్రా సంఘాలు పాల్గొన్నాయి.

అబద్ధాలతో రాజకీయం చేస్తున్న ప్రవీణ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మూడు దశాబ్దాలుగా ఎన్నడూ లేని విధంగా అబద్ధాలతో రాజకీయం చేస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌రెడ్డి ప్రొద్దుటూరు రాజకీయాలను పూర్తిగా కలుషితం చేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యేలు ఎంవిఆర్, వరదరాజులరెడ్డి, లింగారెడ్డితోపాటు వీరికి ముందున్న నాయకులు హుందాగా రాజకీయాలు చేశారన్నారు. అబద్దాలను ఆయుధంగా చేసుకొని విద్వారంగా ప్రవీణ్‌లా ఎవరూ రాజకీయాలు చేయలేదన్నారు. నందం సుబ్బయ్య హత్య కేసులో తన ప్రమేయంలేదని పలుమార్లు చెప్పానని పేర్కొన్నారు. ఇన్ని అరాచకాలకు తెరతీస్తున్న ప్రవీణ్‌రెడ్డికి అధికారమిస్తే ఊరు బతుకుతుందా అని ఎమ్మెల్యే రాచమల్లు ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపాటిటీ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా, బాధితులు పుల్లయ్య, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తోందని, రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మిడుతూరు గ్రామంలో సాగు చేసిన జొన్న పంటను గురువారం సివిల్ సప్లరు డిఎం అర్జున్‌రావు, స్థానిక ఎఒ నాగార్జున పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పంట దిగుబడుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జొన్న పంటకు క్వింటా రూ.3,180 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. వివరాలకు రైతులు 63053 00868 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. క్రాప్ బుకింగ్ తప్పకోవాలన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, సచివాలయం, వ్యవసాయ సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.వి.కొండారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఉప తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, హరిచంద్రారెడ్డి, మునిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, శివరామిరెడ్డి, సుబ్బరాయుడు, భాస్కర్‌రెడ్డి, అశ్వర్థ నారాయణరెడ్డి, శేషయ్య, రాజేశ్వర్ రెడ్డి, నీలకంఠారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రహ్లాదరావు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్స్‌కు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జమ్మలమడుగు తాలూకా సంఘం అధ్యక్షులు దేవదానం కోరారు. గురువారం పెన్షనర్స్ సమస్యలపై తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో గౌతమబోయిన గురుమూర్తి యాదవ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బిసిల అభ్యున్నతే టిడిపి లక్ష్యం

ప్రజాశక్తి - ముద్దనూరు

బిసిల అభ్యున్నతే లక్ష్యంగా టిడిపి నిరంతరం కృషి చేస్తుందని టిడిపి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం భూపేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో జయహో బిసిల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిలకు ప్రాధాన్యత కల్పించి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు. ప్రస్తుత వైసిపి పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బిసి కార్పొరేషన్ నిధులను పక్కదారి పట్టించి కార్పొరేషన్ నిర్వీర్యం చేశారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివరామిరెడ్డి, మైనార్టీ జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ ఖాదర్, మైనార్టీ నాయకులు బాబా అమీర్, నాయకులు సాగర్, మాబు, వినోద్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఎర్రగుంట్ల మండలానికి సంబంధించి జయహో బిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. బిసి నాయకులు నాగేశ్వరరావు, రామకృష్ణతోపాటు పలువురు మాట్లాడుతూ బిసిల సంపూర్ణ మద్దతు టిడిపికే ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిసి సంఘాల నేతలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తూకాల్లో మోసం చేస్తే చర్యలు

ముద్దనూరు : తూనికల కొలతల శాఖ పరిధిలోని వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్న వారు తూకాల్లో వినియోగదారులను మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రొద్దుటూరు లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ జయదేవ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్, సరుకుల దుకాణాలో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. అనంతపురం జయదేవ్ మాట్లాడుతూ వ్యాపారస్తులు విక్రయించే సరకులు కూరగాయల తూకాల్లో వ్యత్యాసాన్ని గుర్తించేందుకు ఎలక్ట్రానిక్ కాటాలకు ముద్ర వేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు కొను గోలు చేసిన వాటిని నష్టపోకుండా తూకం సక్రమంగా ఉండేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాటాకు ముద్ర వేసుకోని వ్యాపారులకు జరిమానా విధిస్తామన్నారు.